క్లుప్తంగా

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని అన్నారు. సోమవారం 28వ వార్డు సచివాలయంలో బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన కమిటీకి చైర్‌పర్సన్‌గా భవానిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను తల్లిదండ్రులు భారమని భావించకుండా బాధ్యతతో చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలు, అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆమె కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ కార్యదర్శులు, స్థానిక ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు మట్టి తరలిస్తే కేసు

యాడికి: అనుమతి లేకుండా చెరువు మట్టి తరలిస్తే కేసులు నమోదు చేయటమే గాకుండా వాహనాలను సీజ్ చేస్తామని నీటిపారుదల శాఖ ఏఈ నూర్జహాన్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని రాయలచెరువు గ్రామ సమీపంలోని చెరువును ఏఈ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ టిప్పర్ల ద్వారా చెరువు మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా తరలించడం నేరమన్నారు. మట్టిని తరలించుకోవాలంటే నీటిపారుదల శాఖ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. చెరువు మట్టిని టిప్పర్ల ద్వారా తరలించ కుండా నీటిపారుదల శాఖ ద్వారా ఓ వ్యక్తిని ఏర్పాటు చేశామన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

యాడికి: చోరీల నియంత్రణకు బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ ఈరన్న బ్యాంకు మేనేజర్లకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు, స్టేట్ బ్యాంకు, సహకార బ్యాంకు, రాయలచెరువు గ్రామంలోని గ్రామీణ బ్యాంకు, స్టేట్ బ్యాంకుల్లోని సీఐ సీసీ కెమెరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేష్, పోలీసులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థి దర్శన్ తేజ్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన దర్శన్ తేజ్ (9వ తరగతి) జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 22, 23 తిరుపతిలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు నిర్వహించారన్నారు. ఇందులో దర్శన్ తేజ్ ప్రథమ స్థానం సాధించారన్నారు. అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకూ గుజరాత్ రాష్ట్రంలోని ఖేడ్‌లో జరిగే స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని హెచ్‌ఎం వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి, లలితమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈఓఆర్డీ బదిలీ

యల్లనూరు: ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న విజయశేఖర్‌నాయుడు తాడిమర్రికి అయ్యారు. పామిడి ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న శశికళను యల్లనూరు ఈఓఆర్డీగా కలెక్టరు వినోద్‌కుమార్ నియమించారు. అలాగే వీఆర్వోలు శ్రీనివాసులు (తాడిపత్రి), శంకర ప్రసాద్ (యల్రగుంటపల్లి), గురుమూర్తి (పెద్దపప్పూరు, సోదనపల్లి) సచివాలయానికి బదిలీ అయ్యారు.

ధర్మ ప్రచారంలో భాగస్వాములు కావాలి

బుక్కరాయసముద్రం: ధర్మ ప్రచారంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీలో త్రైత సిద్దాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

యాడికి: తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం చేనేత ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేనేత కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ తగ్గించిన చీరల కూలీల రేట్లను పెంచాలన్నారు. కార్మికులకు 'నేతన్న నేస్తం' అమలు చేయాలన్నారు. చేనేత కార్మికులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా చేనేత ముద్రా రుణాలు రూ.5 లక్షలు 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో చేనేత ఐక్య వేదిక మండల కన్వీనర్ కోదండరావు, కార్మికులు గోపి, హాజీపీరా, రామాంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- కూలడానికి సిద్ధంగా ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం
- భయాందోళనలో కాలనీ వాసులు

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో సుంకులమ్మ ఆలయం సమీపంలో విద్యుత్ ప్రమాదం పొంచి ఉంది. దీంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభం కూడా కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. దిమ్మె బలహీనంగా ఉండటంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఓ పక్కకు వంగింది. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణనష్టం వాటిల్లే అవకాశముంది. సుమారు ఏడాది క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కన ఏర్పాటు చేయడానికి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సిమెంట్ దిమ్మెను నిర్మించారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్త సిమెంట్ దిమ్మె పైకి మార్చలేదు. కాలనీవాసులు పలు మార్లు విన్నవించినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదంజరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



పక్కకు ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్

అధికారులు స్పందించాలి



ఏడాది క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చడానికి పక్కనే సిమెంట్ దిమ్మెను నిర్మించారు. అయితే ఇప్పటి దాకా ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చలేదు. ప్రమాదం పొంచి ఉండడంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్త దిమ్మె పైకి మార్చాలి. లేకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

– గోవిందు, ఓల్డ్ సీపీఐ కాలనీ, గుత్తి

పొంచి ఉన్న ప్రమాదం



సత్యనారాయణపేటలో ఆంజనేయస్వామి గుడికి వెళ్లే రహదారిలోని కల్వర్టు దుస్థితి..

గుంతకల్లు: పట్టణంలోని సత్యనారాయణపేటలో ఆంజనేయస్వామి గుడి వెళ్లే రహదారిలో కల్వర్టు కూలి ప్రమాదకరంగా మారింది. నెల దాటినా కల్వర్టు మరమ్మతుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారని వీధి వాసులు వాపోతున్నారు. ఈ మార్గం గుండా ఆంజనేయస్వామి గుడి, దుర్గమ్మగుడికి భక్తులు, డీఆర్‌ఎం కార్యాలయం వెళ్లే ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కల్వర్టును మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరారు.

కల్వర్టుకు రంధ్రం

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలోకి వెళ్లే గ్రామ ముఖ్యద్వారం వద్ద కల్వర్టు దెబ్బతింది. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టుకు చీలికలు ఏర్పడంతో రంధ్రం పడింది. హైవేలో దిగి గ్రామంలోకి వెళ్లాలంటే ఇది ప్రధాన రోడ్డు. ఈ రోడ్డుపై 20 ఏళ్ళ క్రితం నిర్మించిన కల్వర్టు దెబ్బతినడంతో రాకపోకలు స్థంభించాయి. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేసి రాకపోకలను సుగమం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రామరాజుపల్లిలోకి వెళ్లే ప్రధాన రోడ్డు కల్వర్టుపై రంధ్రం ఏర్పడిన దృశ్యం

'అనంత'ను కలసిన వైవీఆర్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు గుంతకల్లు నుంచి వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జిల్లా అధ్యక్షుడు 'అనంత'కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అనంత కలసిన పామిడి నాయకులు

పామిడి: అనంతపురం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డిని ఆయన స్వగృహంలో సోమవారం పామిడి మండల నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్ రెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, సీనియర్ నాయకులు ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, బద్రీనాయక్, సురేష్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

యాడికి: యాడికి పోలీస్టేషన్‌ను డీఎస్పీ రామకృష్ణుడు సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు, పేకాట జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో రాత్రి పూట గస్తీ ముమ్మరంగా చేపట్టి చోరీలు జరగకుండా చూడాలని సీఐ ఈరన్నను ఆదేశించారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

గుంతకల్లు రూరల్: రైతుల అభివృద్ధి, సంక్షేమం, లాభసాటి వ్యవసాయం కోసం మండలంలో మంగళవారం నుంచి డిసెంబర్ చివరి దాకా పొలం–పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ స్వాతి సోమవారం తెలిపారు. మంగళవారం మండలంలోని దంచర్ల, పాతకొత్తచెరువు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

పల్లవి హైస్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు రూరల్: నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలను నిర్వహిస్తున్న పల్లవి హైస్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాలు... పట్టణంలోని సిద్ధార్థ్ నగర్‌కు చెందిన భగవంతప్ప అనే వ్యక్తి తన మనవళ్లు ఆనంద్‌రాజ్ 6వ తరగతి, అక్షర 2వ తరగతి పల్లవి హైస్కూల్‌లో చదివిస్తున్నాడు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులు పట్టణంలోని గణేష్ బుక్‌స్టాల్‌లో మాత్రమే కొనాలని యాజమాన్యం ఆంక్షలు విధించారు. రెండు సార్లు పుస్తకాలు కొన్నా గణేష్ బుక్ స్టాల్ వాళ్లు బిల్లులు ఇవ్వకపోవడంతో పాఠశాల వద్దకు వెళ్లి యాజమాన్యాన్ని ప్రశ్నించాడు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన పాఠశాల యాజమాన్యం సోమవారం పిల్లలను పాఠశాల బయటే నిలబెట్టింది. వెంటనే వచ్చి పిల్లలను, టీసీలు తీసుకుపోవాలని భగవంతప్పకు సమాచారం అందజేశారు. దీంతో భగవంతప్ప పాఠశాల వద్దకు వెళ్లి ప్రశ్నించినా యాజమాన్యం ఏమాత్రం స్పందించకపోవడంతో, తన ఇద్దరు మనవళ్లను తీసుకుని నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌తో తన వేదన చెప్పుకుందా బోరుమన్నాడు. అప్పటికే విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు వెంటనే తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని బాధితులతో కలిసి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. పిల్లలను వెంటనే స్కూలులోకి తీసుకోవాలని, విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్న ప్రతి దానికి స్కూల్ యాజమాన్యం వెంటనే ఆధారాలతో కూడిన రాతపూర్వక సమాధానం ఎంతఓకు అందజేయాలని తహసీల్దార్ రమాదేవి ఆదేశించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి

పామిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్య వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు పరచడంలో జిల్లా అధికారులు విఫలమయ్యారన్నారు. అనంతరం ఆసంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడిగా భరత్, ఉపాధ్యక్షులుగా శ్యామ్‌కుమార్, అఖిల్, సహాయ కార్యదర్శులుగా రాజు, గంగాధర్, మస్తాన్‌వలి, గోవర్ధన్, నితిన్, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి, జిల్లా కన్వీనర్‌గా రమేష్‌బాబు ఎన్నికయ్యారు.

30న సొసైటీ సర్వసభ్య సమావేశం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటీ కార్యాలయంలో ఈ నెల 30న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్, సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ సొసైటీ అధికారి బాల గంగాధర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సభ్యులు సొసైటీలో కేవైసీ వివరాలు ఈనెల 30 లోపు చెక్ చేయించుకోవాలన్నారు. లేని పక్షంలో ఎన్నికల అర్హత కోల్పోతారన్నారు. అదే విధంగా రుణమాఫీ పంటల బీమా, నష్ట పరిహారం వర్తించదన్నారు. కార్యక్రమంలో కొండారెడ్డి, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

యాడికి: మండల కేంద్రంలోని శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సంధ్యాల శాంతిరాం కంటి వైద్యశాల టెక్నీషియన్ శేఖర్, మేనేజర్ నాగార్జున 104 మందికి కంటి పరీక్షలు చేశారు. ఆపరేషన్ కోసం 30 మందిని నంద్యాలకు తరలించారు. 25 మందికి కంటి అద్దాలు సిఫారసు చేశారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, రామ్మోహన్, నాయకులు శ్రీరాములు, బాలపెద్దయ్య, కోట చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి'

గార్లదిన్నె: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని రాయల సీమ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీటీ విజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాయల సీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, సుబ్బన్న, మల్లన్న, వన్నూరప్ప పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు రూరల్: పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ కార్యదర్శి నరసయ్య, చిన్నకొండయ్య తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులకు బెనిఫిట్స్‌ను అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

గుంతకల్లుటౌన్/గుత్తి: పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం గుంతకల్లులోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్, వైద్యశాఖ అధికారులు ఉచిత వైద్యశిబిరం ఏర్పా టు చేశారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ సురేఖ, డాక్టర్ స్వాతి, వైద్య, ఆరోగ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గుత్తి కోట వీధిలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆధ్వర్యంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు స్వచ్ఛతా హీ సేవా నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి రూరల్: మండలంలోని పులిప్రొద్దుటూరు సమీపంలో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. ఎస్ఐ కాటయ్య, సిబ్బందితో కలసి తనిఖీ చేయగా జూదరులు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.1.50 లక్షలతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో శ్రీనివాసపురానికి చెందిన షేక్ రహీంబాషా, పోరాటకాలనీ సోమనాథ్, రామాంజనేయులు, గాంధీకట్ట సాయికుమార్, సీపీఐ కాలనీ సురేంద్రరెడ్డి, పాతకోట షేక్ నబీరసూల్, ఇందిరానగర్ షేక్ జిలానీ, నందలపాడు షేక్ అబ్దుల్, పులిప్రొద్దుటూరుకు చెందిన సత్యనారాయణరెడ్డి, చుక్కలూరు చింతారాజు ఉన్నారు.

అర్హులందరికీ రేషన్ అందించాలి

గుంతకల్లు రూరల్: రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బీ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించండి

పెద్దవడుగూరు: మండలంలోని దళితుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపప్పూరు ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి కొండయ్య, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతాపురుషోత్తం డిమండ్ చేశారు. దళితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఉషారాణికి అందజేశారు.

రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

శింగనమల: బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 25, 26న నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పీడీ నందకుమార్ సోమవారం తెలిపారు. నియోజకవర్గంలోని శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

ఎన్‌సీసీతో బంగారు భవిష్యత్

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు ఎన్‌సీసీతో బంగారు భవిష్యత్తు సాధ్యమని మిలటరీ అధికారి సుబేదార్ కౌశలేంద్ర సింగ్ సూచించారు. సోమవారం గుత్తి రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీలో చేరేందుకు కళాశాల డైరెక్టర్లు సత్య నారాయణ, రామ్‌కుమార్ ఆధ్వర్యంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమ్మ జాతరపై సమావేశం

యల్లనూరు: మండల కేంద్రంలోని పాతపేటలో వెలసిన పెద్దమ్మ తల్లి జాతర నిర్వహణపై ఆలయ ధర్మకర్త గంగాధర్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. గత 2016లో అమ్మవారి జాతరను జరిపించారని , ఏడేళ్లు కావస్తున్నా జాతర జరగలేదన్నారు. కొన్ని కారణాలు, కట్టుబాట్ల వల్ల జాతర ఆలస్యమైందని, వచ్చే ఏడాది జనవరి 18, 19 తేదీల్లో జాతర నిర్వహించేందుకు పెద్దలు నిర్ణయించారు.


రైతులకు పెట్టుబడి సాయం అందించండి

శింగనమల/పెద్దవడుగూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం శింగనమలలో తహసీల్దార్ బ్రహ్మయ్యకు రైతు సంఘం మండల జిల్లా, మండల నాయకులు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు కొండారెడ్డి, బాలరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే ఈ నెల 25న రైతుల సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద చేట్టిన ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి దస్తగిరి, మండల కార్యదర్శులు ఈశ్వరరెడ్డి, సుధీర్‌రెడ్డి, కార్యకర్తలు పెద్దన్న, సుంకన్న పెద్దవడుగూరు బస్టాండ్ వద్ద కరపత్రాలు విడుదల చేశారు.

వ్యక్తిపై మహిళ ఫిర్యాదు

యల్లనూరు: మండలంలోని వాసాపురం గ్రామానికి చెందిన సూరి అనే వ్యక్తి అసభ్యంగా మాట్లాడాడని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ సోమవారం ఎస్ఐ రాంప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వివరాల మేరకు.. వాసాపురం హరిజన వాడలో నివాసముంటున్న మహిళ ఆదివారం ఇంట్లో ఒంటరిగా ఉండగా సూరి అనే వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి రమ్మని పిలిచి, సైగలు చేసి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించామని ఎస్ఐ తెలిపారు.

మిడ్ పెన్నార్ డ్యాం దక్షిణ కాలువకు నీరు విడుదల



మిడ్ పెన్నార్ డ్యాంలో దక్షిణ కాలువకు నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

గార్లదిన్నె: మండలంలోని మిడ్‌పెన్నార్ డ్యాం దక్షిణ కాలువకు సోమవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ బటన్ నొక్కి సాగు నీరు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మిడ్‌పెన్నార్ డ్యాం గేట్లకు రూ.10 లక్షలు ఖర్చుచేసి మరమ్మతులు చేశామన్నారు.అ లాగే దక్షిణ కాలువకు దాదాపు 130 రోజులు నీటి సరఫరా చేసి ఆయకట్టు పంటలకు సాగునీరు అందిస్తామన్నారు. అనంతరం 450 క్యూసెక్కులు నీరువిడుదల చేశారు. అలాగే పెనకచెర్ల గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం క్యాక్రమంలో పాల్గొని, పెనకచెర్ల, ఇల్లూరు గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా రెండు ట్రాక్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, హెచ్చెల్సీ డీఈ చంద్ర శేఖర్, ఏఈ సురేంద్ర , వివిధ మండల నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి గుడి వివాదం పరిష్కారం



గ్రామస్తులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో చర్చిస్తున్న పోలీసులు

శింగనమల: మండలంలోని నాయపల్లి క్రాస్‌లోని బ్రహ్మంగారి గుడి వివాదం పరిష్కారమైంది. వివరాలు.. రోడ్డు విస్తరణలో భాగంగా ఆలయ తొలగింపు పనులను సోమవారం పెరవలి గ్రామస్తులు, గుడిని నిర్మించిన వారి కుటుంబీకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డుకున్నారు. గుడికి పరిహారం ఇవ్వకుండా, నిర్మించిన వారికి న్యాయం చేయకుండా ఎలా పనులు చేపడుతారని రోడ్డు పనులు చేసే వారిని నిలదీశారు. చివరకు రెవెన్యూ అధికారులు, సీఐ కౌలుట్లయ్య, నార్పల ఎస్ఐ సాగర్ అందరితో చర్చించారు. గుడిని నిర్మించిన వారికి రూ.2 లక్షలు, 3 సెంట్లు స్థలం ఇచ్చేలా రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. అలాగే గుడికి నష్ట పరిహారం కింద రూ.35 లక్షలు మంజురైందని, గుడి నిర్మాణం కోసం కమిటీ వేసుకుంటే , వారి అకౌంటుకు నిధులు జమ చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

శింగనమల: శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందని, అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ ఉమాశంకరమ్మ సోమవారం తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 6 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. బుక్కరాయసముద్రం మండలంలోని గాంధీనగర్ వర్కరు (బీసీ–బీ), రాఘవేంద్ర కాలనీ హెల్పర్ (జనరల్), శింగనమల మండలంలో శింగనమల–2 సెంటర్ హెల్పర్ (బీసీ–డీ), గోవిందరాయునిపేటలో హెల్పర్ (జనరల్), గార్లదిన్నె మండలంలోని కల్లూరు–3 సెంటర్ హెల్పరు (ఎస్సీ), కల్లూరు–4 సెంటర్ హెల్పర్ (బీసీ–డీ)లకు కేటాయించామన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 1 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

గుత్తి: గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ ఢిల్లీశ్వరి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంతకల్లులోని అంకాలమ్మ గుడి అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న కార్యకర్త, ఆయా, అమీన్ పల్లిలో ఆయా పోస్టులతో పాటు గుత్తిలోని పద్మనాభయ్య ఫ్యాక్టరీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా, కొత్తపేట–1 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

యల్లనూరు: స్త్రీ శిశు సంక్షేమ శాఖలో మినీ అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని నార్పల ప్రాజెక్టు సీడీపీఓ భారతి సోమవారం తెలిపారు. నార్పల ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ వర్కరు, 8 అంగన్వాడీ హెల్పర్లు ఖాళీలు ఉన్నాయన్నారు. నార్పల మండలంలో నడింపల్లి (ఎస్టీ) మినీ అంగన్వాడీ వర్కర్, గుంజేపల్లి హెల్పర్ (హెచ్‌హెచ్ లోకోమోటార్ డిజేబుల్) గజరాజుపల్లి హెల్పర్ (ఎస్సీ), తిక్కస్వామి వీధి–1 హెల్పర్ (ఎస్టీ), తిక్కస్వామా వీధి–2 హెల్పర్ (ఓసీ), యల్లనూరు మండలంలో చింతకాయమంద హెల్పర్ (వీహెచ్ లోకోమోటార్ డిజేబుల్), చిలమకూరు హెల్పర్ (బీసీ–బి), పుట్లూరు మండలంలో శనగల గూడూరు–2 హెల్పర్ (ఎస్సీ), పుట్లూరు–2 హెల్పర్ (ఓసీ) అర్హత కలిగిన మహిళలు దర ఖాస్తు చేసుకోవాలన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి: కూటమి ప్రభుత్వ పాలన అభివృద్ధే ధ్యేయంగా సాగుతోందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం మండలంలోని కత్రిమల గ్రామంలో నిర్వహించిన మన మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తా నన్నారు. పామిడి మండలాన్ని ప్రగతి పథంలో పయనింపజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మక చంద్రశేఖర్‌రెడ్డి, మండల స్పెషలాఫీసర్ అప్పాజీ, తహసీల్దార్ ఎన్ శ్రీధర్‌బాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'టీచర్లను వేధిస్తున్న పామిడి ఎంఈఓ'

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్లను వేధిస్తున్న పామిడి ఎంఈఓ–1 జయానాయక్‌పై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం డీఈఓ వరలక్ష్మిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఏడేళ్లుగా అక్కడే పని చేస్తున్న జయానాయక్ వ్యక్తిగత, సామూహిక సమస్యలను సృష్టిస్తూ టీచర్ల ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తున్నారన్నారు. పని సర్దుబాటులో సమస్యలను పరిష్కరించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రశ్నించిన ఉపాధ్యాయ సంఘాల నాయకులపై కక్ష పూరితంగా వ్యవహరించారన్నారు. విచారణ చేయించి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లింగమయ్య, గోవింద రాజులు, బీఈడీ అసోసియేషన్ లింగమూర్తి, డీటీఎఫ్ జార్జ్, పురుషోత్తం తదితరులు ఉన్నారు.